



# మన దునియా

Our News Our World

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం









సంపుటి : 3 | సంచిక : 240 | మార్చ్ 17 మంగళవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# మంథని 'బాయస్' కాలేజీలో 'లెక్చరర్ల' వికృత చేష్టలు

## విద్య బుద్ధులు చెప్పడం మానేసిన ఆ ముగ్గురు ప్రబుద్ధులు

## ముగ్గురు లెక్చరర్లు ఏది చేసినా చోద్యం చూస్తున్న కాలేజ్ ప్రిన్సిపాల్



**మన దునియా,పెద్దపల్లి జిల్లా మంథని:మార్చి 16**

పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ (బాయస్) కళాశాలలో పాఠాలు బోధించవల్సిన లెక్చరర్లు విద్యార్థుల ముందే వికృత చేష్టలు చేస్తూన్నారని,అందులో ఆ ముగ్గురు చరిత్ర బోధకుడు,బోటాని,ఆంగ్ల లెక్చరర్లు మితిమీరి కాలేజీలో ప్రవర్తిస్తున్నారని విద్యార్థులు,లెక్చరర్లు వాపోతున్నారు.ఇదేమిటని సహా అధ్యాపకులు అడిగితే ఇది మా ఇష్టం.మా ప్రిన్సిపాల్ ఏమి అనడం లేదు.మీరెవరు అడగడానికి అని బుకాయిస్తున్నారని,ఇదే విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ వారిని ప్రత్యక్షంగా చూసినా కూడా వారిని మందలించకుండా చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నదని అనుకొంటున్నారు.ప్రిన్సిపాల్ కు సమాచారం ఇస్తే ఆమె ఆ ముగ్గురిని కాపాడటం కోసం విషయాన్ని దాటవేస్తూ సమాధానం ఇచ్చి వారిని వెనుకేసుకొస్తుదని అధ్యాపకులు ఆశ్చర్యానికి గురవుతున్నారు.ఈ వికృత వెకిలి చేష్టలు జరిపే ముగ్గురు అధ్యాపకులు విద్యార్థుల తరగతి గదులలో కూర్చొని వారిని చదువుకోమని చెప్పి ఒకరికొకరు శరీరాలు తాకిచ్చుకుంటూ,ఒకరినొకరు గిల్లుకుంటున్నారని,మాకు చదువులు చెప్పే లెక్చలేర్లే ఇలా వికృతమైన పనులు చేస్తున్నారని,మాకు కాలేజీకి రావడానికి కూడా అయిష్టముగానే ఉందని విద్యార్థులు గొళ్ళుమంటున్నారు.ఇదంతా చూసిన కళాశాల ప్రిన్సిపాల్ కూడా ఏమి పట్టనట్టు ఆ సదరు లెక్చరర్లు తప్పు చేస్తున్న వారిని ఏమీ అనకుండా వారు నా వాళ్ళు అని వెనుకేసుకొస్తున్నదని అధ్యాపకులు

## మోదీ పర్యటనకు, ఇరాన్‌పై దాడికి సంబంధం లేదు: ఇజ్రాయెల్ రాయబారి రువెన్ అజార్



పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో భారత ప్రధాని మోదీ పర్యటనపై వస్తున్న విమర్శలకు భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రువెన్ అజార్ స్పష్టతనిచ్చారు. ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటనకు, ఆ వెంటనే ఇరాన్‌పై జరిగిన దాడులకు ఎలాంటి సంబంధం లేదని ఆయన తేల్చి చెప్పారు.ప్రధాని మోదీ ఫిబ్రవరి 25-26 తేదీల్లో ఇజ్రాయెల్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత రెండు రోజుల తర్వాత (ఫిబ్రవరి 28న) ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు ప్రారంభించాయి. ఈ క్రమాన్ని ఉటంకిస్తూ, పశ్చిమాసియా ఉద్రిక్తతలకు భారత్ మద్దతు ఇస్తోందన్నట్లుగా విపక్షాలు చేస్తున్న విమర్శలను ఇజ్రాయెల్ రాయబారి తోసిపుచ్చారు. ఆ ప్రాంతంలో పరిస్థితులు మోదీ పర్యటనకు ముందు నుంచే అస్థిరంగా ఉన్నాయని, ఆపరేషన్ చేపట్టేందుకు తమకు అవకాశం వచ్చినప్పుడే దాడులు చేశామని ఆయన వివరించారు. మోదీ ఇజ్రాయెల్ పర్యటన పూర్తిగా రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ఉద్దేశించినదని, దీనిని సైనిక చర్యలతో ముడిపెట్టడం సరికాదని ఆయన స్పష్టం చేశారు.

## మీ సలహాలు స్వీకరిస్తాం.. సభకు రండి: కేసీఆర్‌కు కోమటిరెడ్డి విజ్ఞప్తి



మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కె. చంద్రశేఖర్ రావు అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలిచ్చిన తీర్పును గౌరవించి, సభా కార్యక్రమాల్లో పాల్గొనడం ప్రతిపక్ష నేతగా కేసీఆర్ కనీస

## ఎన్నికల హామీలపై అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్‌ను నిలదీస్తాం: కేటీఆర్



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సోమవారం నాడు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా, అసెంబ్లీకి వెళ్లేముందు ఆయన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి గన్‌పార్క్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపానికి

## ప్రపంచానికి దిక్సూచి తెలంగాణ: గవర్నర్ ప్రతాప్ శుక్లా!

**మన దునియా,హైదరాబాద్:మార్చి16**

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ముందుగా సభలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రసంగిస్తున్నారు. తెలుగులో ప్రసంగం ప్రారంభించిన గవర్నర్.. తెలంగాణ పురోగతిలో ప్రతిపౌరుడు భాగస్వామి.. అని.. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా మా పాలన సాగుతోందని పేర్కొన్నారు. 2047 తెలంగాణ రైజింగ్ దిశగా అడుగులు వేస్తున్నాం.. ప్రపంచానికి దిక్సూచిగా తెలంగాణ మారుతోంది.. కోర్, ప్యూర్, రేర్‌గా తెలంగాణను విభజించామని గవర్నర్ పేర్కొన్నారు.సమావేశాల ప్రారంభానికి ముందుగా.. అసెంబ్లీలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అసెంబ్లీ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం పక్కనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసింది



మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం

# మంథని 'బాయస్' కాలేజీలో 'లెక్చరర్ల' వికృత చేష్టలు

(మొదటి పేజీ తరువాయి)

,పిల్లల తల్లిదండ్రులు కూడా పదేపదే హెచ్చరించిన పట్టించుకోవడం లేదని,ఇంతా జరిగిన ఆ రాసలీల వీరులను ఈమె ఎందుకు కాపాడుతున్నారో తెలియడం లేదని,ప్రిన్సిపాల్ కు వీళ్లపై అంతా చొరవ తీసుకునే అవసరం ఏమున్నదని వాదిస్తున్నారు పిల్లల తల్లిదండ్రులు.కాలేజి స్టాఫ్ రూములో కూడా ఆ వికృత చేష్టలు చేసే వీరులు క్లాస్ టైంలోగానీ,అన్నం తినేటప్పుడు కూడా వీరు ఒక్కరికాలు ఒక్కరు రుద్దుకోవడం,ఒక్కరినొకరు చేతులు నొక్కుకోవడం ఇదంతా తోటి లెక్చరర్లు చూడడశీ ఇష్టంలేక అక్కడినుండి వెళ్లిపోతున్నామని,పలుమార్లు ప్రిన్సిపాల్ కు చెప్పిన వాళ్ళను కాపాడుతూ వస్తున్నదని సహ అధ్యాపకులు ఘోషిస్తున్నారు.వాళ్లు ముగ్గురు నాకు బాగా దగ్గరని,స్నేహితులుగా కలిసి ఉంటారని,ఇందులో తప్పు ఏమున్నదని ప్రిన్సిపాల్ లెక్చరర్లను బుకాయిస్తున్నదని చెబుతున్నారని,స్టూడెంట్స్ లీడర్లు వాపోతున్నారు.ప్రశాంత వాతావరణంలో విద్యాబుద్ధులు చెప్పే అధ్యాపకులు,కళాశాల ప్రిన్సిపాల్ కూడా వింత ధోరణితో ప్రవర్తిస్తున్నారని,కనీసం ప్రజాప్రతినిధులు కళాశాలకు వెళ్ళితే కనీస మర్యాద,గౌరవం ఇవ్వదని,ఆమెకు పదవి అహంకారం ఎక్కువని వాపోతున్నారు.ఇంకా కళాశాల అధ్యాపకులనైతే తన ఇంట్లో పని చేసే పని మనుషులకన్న హీనంగా చూస్తూన్నదని,పరుష జాలంతో దూషిస్తున్నారని గోడు వెళ్ళబోస్తున్నారు.ఇలా చేస్తున్న స్థానిక మంథని బాయాస్ కాలేజి ప్రిన్సిపాల్ ఇదంతా ఎందుకు చేస్తున్నాదోనని,తోటి ఉద్యోగస్తులు మానసిక వేదనకు గురి చేయడమే కాకుండా,వ్యక్తిగత కక్ష్య సాధింపులకు దిగుతూ "నేను ఇక్కడ చెప్పిందే వేదం,నేను చెప్పినట్టుగానే నడుచుకోవాలి.లేదంటే మీకు మెమోలు జారీ చేస్తానని బెదిరిసున్నారని" ఉద్యోగస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇవే కాకుండా కళాలశాలలో లెక్చరర్లకు మధ్య తగాదాలు పెట్టి ఒక్కరికొక్కరికి పడకుండా వేరుపర్చి గ్రూప్ గా విడగొట్టి తన పంథాన్ని నెగ్గించుకుంటున్నదని,ప్రిన్సిపాల్ వ్యవహరించే తీరు,ఆ రాసలీలలు జరిపే ముగ్గురు అధ్యాపకులు ఈమె అండ చూసుకొని మిగతా లెక్చరర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధను వ్యక్తం చేస్తున్నారు.వీటివల్ల మంథని పరిసర ప్రాంతాల్లో ఉండే విద్యార్థులు కళాశాలకు రావడానికి ఇబ్బశీది పడుతున్నామని విద్యార్థులు అయిష్టతను చూపిస్తున్నారు.ఇది ఇలాగే కొనసాగితే కళాశాలకు అడ్మిషన్లు రావడం కష్టంగా మారుతున్నదని స్థానిక విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.ఇలాంటి అమర్యాద కలిగిన ప్రిన్సిపాల్ ను ఇదివరకెప్పుడు చూడలేదని,ఇంత అహంకారపూరిత వ్యవహార శైలి ఎప్పుడు మా అనుభవంలోకి రాలేదని ఆశ్చర్యశీగా ఉన్నదని స్టూడెంట్స్ లీడర్లు,తల్లిదండ్రులు,ప్రజా ప్రతినిధులు అంటున్నారు.ఇప్పటికైనా ఆ ముగ్గురు రాసలీలలు జరిపే చరిత్ర,బొటనీ,ఆంగ్ల అధ్యాపకులను,ఇది ప్రోత్సహిస్తూ వస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ పై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ఉన్నత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నామని తెలుపుతున్నారు.

## ప్రపంచానికి దిక్సూచి తెలంగాణ: గవర్నర్ ప్రతాప్ శుక్లా!

(మొదటి పేజీ తరువాయి)



ప్రభుత్వం. .. గాం ధీ విగ్రహానికి లెఫ్ట్ సైడ్‌లో ఇప్పటికే అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు గాంధీ విగ్రహానికి రైట్ సైడ్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేశారు.గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత సభ మంగళవారా నికి వాయిదా పడనుంది. ఆ తర్వాత స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన శాసనసభ బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) భేటీ జరగనుంది.. బడ్జెట్ సమావేశాలకు సంబంధించిన అజెండా.. ఎన్ని రోజులు అసెంబ్లీ నిర్వహించాలి.. అనే దానిపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. మంగళ, బుధ వారాల్లో.. గవర్నర్ ప్రసంగానికి ధన్య వాదాలు తెలిపే తీర్మానం పైన చర్చ, సమాధానం ఉంటాయి. అనంతరం.. బడ్జెట్ ను ప్రవేశపెట్టను న్నారు.


## ఎన్నికల హామీలపై అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్‌ను నిలదీస్తాం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)



నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని, వాటికి చట్టబద్ధత కల్పించాలని, బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించడం తమ పార్టీకి సంప్రదాయమని కేటీఆర్ గుర్తుచేశారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ప్రజలను మోసం చేసిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రైతులను పట్టించుకోకుండా రాహుల్ గాంధీ కోసం రూ. 1000 కోట్లు కేటాయించేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తోందని ఆరోపించారు. "రాహుల్ బంధు కాదు, రైతు బంధు ఇవ్వండి" అనే నినాదంతో తాము పోరాడతామని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో పంట వేయకముందే రైతు బంధు నిధులు అందేవని, ఇప్పుడు పంట కోతలు పూర్తవుతున్నా ప్రభుత్వ సాయం అందడం లేదని మండిపడ్డారు.అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, తొలి కేబినెట్‌లోనే చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా గ్యారెంటీలకు చట్టపరమైన భద్రత కల్పించలేదని విమర్శించారు. గతంలో గవర్నర్ ప్రసంగంలోనూ ఈ హామీ ఇచ్చినా, ప్రభుత్వం ఆ మాట నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. బలహీన వర్గాలకు ఐదేళ్లలో రూ. 1 లక్ష కోట్లు కేటాయిస్తామన్న హామీపైనా స్పష్టత లేదని అన్నారు. ఈ అంశాలన్నింటినీ అసెంబ్లీలో ప్రస్తావించి, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతామని కేటీఆర్ హెచ్చరించారు.

## మీ సలహాలు స్వీకరిస్తాం.. సభకు రండి: కేసీఆర్‌కు కోమటిరెడ్డి విజ్ఞప్తి



బాధ్యత అని ఆయన అన్నారు. నిన్న సంగారెడ్డిలో ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలు మార్పు కోరుకునే కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని, ఆ తీర్పును స్వాగతించాలని కోమటిరెడ్డి అన్నారు. కేసీఆర్ సభకు వచ్చి ప్రభుత్వ పనితీరుపై సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. "మా పనిలో ఏవైనా తప్పులుంటే చెప్పండి, తప్పకుండా మార్చుకుంటాం. కానీ, అసెంబ్లీకే రాకపోవడం సరికాదు," అని హితవు పలికారు. ఇటీవల కేసీఆర్ సభకు ఒక్క నిమిషం మాత్రమే హాజరై, గవర్నర్ ప్రసంగం ముగియకముందే వెళ్లిపోవడం, మరణించిన సభ్యులకు సంతాపం తెలిపేంత వరకు కూడా ఉండకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీపై బీఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం హాస్యాస్పదమని అన్నారు. ఫ్లోరైడ్ తో నల్లొండ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూసీ ప్రక్షాళన చేస్తే వారి జీవితాలు కూడా బాగుపడతాయని మంత్రి పేర్కొన్నారు.

## యువగళంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా: 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' ఆవిష్కరణలో మంత్రి లోకేశ్

అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేస్తానని యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నానని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రజారాజధాని అమరావతిలో తన హామీకి ప్రతిరూపంగా నిలిచిన 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' ఆవిష్కరణ తనకెంతో ఆనందాన్నిచ్చిందని ఆయన పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని, ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన సాగించిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు ప్రతీకగా

58 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహాన్ని అమరావతిలోని శాఖమూరులో ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా జరిగిన ఈ విగ్రహావిష్కరణ మహోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరజీవి త్యాగశిల్పం వద్ద ఆయన పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ఒక మనిషి త్యాగం ఒక జాతికి గౌరవంగా నిలిచింది. ఒక దీక్ష ఒక రాష్ట్రాన్ని ఇచ్చింది. పొట్టి శ్రీరాములు గారు మరణం లేని మహనీయుడు, త్యాగానికి మానవరూపం. ఆయన 125వ జయంతి రోజున 58 అడుగుల విగ్రహం రూపంలో మనకోసం మళ్లీ జన్మించారు. ఈ విగ్రహానికి ఏం పేరు పెట్టాలని డూండి రాకేష్ అడిగినప్పుడు, ఆయన త్యాగం గుర్తుకురావాలనే ఉద్దేశంతో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' అని సూచించాను. ఈ విగ్రహం తెలుగుజాతి గొప్పతనాన్ని అమరావతి నుంచి అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళుతుంది" అని వివరించారు.

యువగళం హామీని నిలబెట్టుకున్నా

తాను తెలుగువాడినని, ఆంధ్రప్రదేశ్ పౌరుడినని గర్వంగా చెప్పుకుంటున్నానని, ఆ గౌరవాన్ని మనందరికీ ఇచ్చింది పొట్టి శ్రీరాములు అని లోకేశ్ అన్నారు. "యువగళం పాదయాత్రలో ఆర్యవైశ్య సోదరులను అనేకసార్లు కలిసి వారి సమస్యలు చర్చించాను. వారికిచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే అమరావతిలో అమరజీవి విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చాను. ఇచ్చిన హామీని ఇంత తక్కువ సమయంలో నిలబెట్టుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ విగ్రహంలోని 58 అడుగులు, ఆయన చేసిన 58 రోజుల దీక్షకు సంకేతం. మనం ఒక్కరోజు ఉపవాసం ఉండటానికే ఇబ్బంది పడతాం. అలాంటిది ఒక రాష్ట్రం కోసం ఆయన 58 రోజులు దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారు. ఈ చరిత్రను భావితరాలకు అందించడం మనందరి బాధ్యత" అని లోకేశ్ ఉద్ఘాటించారు. కేవలం 194 రోజుల్లోనే విగ్రహ ఏర్పాటు పూర్తి చేసిన కూటమి ప్రభుత్వాన్ని, ట్రస్ట్ సభ్యులను, అధికారులను ఆయన అభినందించారు.

నిత్య పోరాటయోధుడు పొట్టి శ్రీరాములు

పొట్టి శ్రీరాములు జీవితాన్ని స్మరించుకుంటూ, ఆయన నిత్య పోరాటయోధుడని లోకేశ్ కొనియాడారు. "ఆయన స్వార్థం లేని ఉద్యమాలు చేశారు. గాంధీజీతో కలిసి సబర్మతి ఆశ్రమంలో పనిచేశారు. స్వాతంత్ర్య పోరాటంలో జైలుకు వెళ్లారు. నెల్లూరులో దళితుల ఆలయ ప్రవేశం కోసం, అంటరానితనంపై పోరాడారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడకపోవడం మహాపాపం అని ప్రకటించి, 'వస్తే రాష్ట్రం, పోతే ప్రాణం' అని నిశ్చయించుకున్నారు. దీక్షకు ఎవరూ స్థలం ఇవ్వకపోతే రోడ్డు మీదే చేస్తానన్న ఆయన స్ఫూర్తి నా యువగళం పాదయాత్రకు ప్రేరణగా నిలిచింది" అని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. 1952 అక్టోబర్ 19న మద్రాసులో బులుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించినప్పుడు 53.9 కిలోల బరువున్న పొట్టి శ్రీరాములు, 58వ రోజుకు 38.1 కిలోలకు పడిపోయారని, అయినా వెనకడుగు వేయకుండా ప్రాణత్యాగంతో ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారని లోకేశ్ వివరించారు. ఆయన ప్రాణత్యాగం కోట్ల మందిని కదిలించి, ఢిల్లీని దిగివచ్చేలా చేసిందని, ఫలితంగా 1953 అక్టోబర్ 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు.


భారతదేశ చిత్రపటాన్ని మార్చిన మహనీయుడు

ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ వ్యాసాన్ని ఉటంకిస్తూ, "పొట్టి శ్రీరాములు గారి దీక్ష తర్వాతే భారతదేశ చిత్రపటంపై భాషా ప్రయుక్త రాష్ట్రాల రేఖలు ఏర్పడ్డాయని గుహ అన్నారు. అందుకే ఆయనను 'భారతదేశ మెర్కాటర్'గా అభివర్ణించారు. 16వ శతాబ్దంలో ప్రపంచ పటాన్ని రూపొందించిన భౌగోళిక శాస్త్రవేత్త మెర్కాటర్. అంతటి గొప్ప వ్యక్తి చరిత్రను దేశం గుర్తుంచుకునేలా ఈ విగ్రహం దోహదపడుతుంది" అని లోకేష్ అన్నారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి రోశయ్యను స్మరించుకున్న లోకేశ్, ఆయన రాజకీయాలకు అతీతంగా పనిచేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ కోరిక మేరకు పొట్టి శ్రీరాములు పేరు మీద స్మారక నాణెం విడుదల కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని లోకేష్ వెల్లడించారు. రాబోయే 12 నెలల్లో స్మృతివనం, ఫొటో గ్యాలరీ, మ్యూజియం, ఆడిటోరియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్. సవిత, టీజీ భరత్, పి. నారాయణ, కందుల దుర్గేశ్, నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యేలు, అధికారులు, పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
మార్చ్ | మంగళవారం | 17 | 2026


# పి సి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జన్నారంలో తల సేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం

**పి సి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జన్నారంలో తల సేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా (ప్రతినిధి శరత్) మార్చ్:16.**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో పి సి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పిసిఆర్ ఫౌండేషన్ స్థాపించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా తల సేమియా బాధితుల కోసం సోమవారం జన్నారం మండలం కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా సుమారు 50 మంది దాతల నుండి రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో పిసిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మడుగు ప్రవీణ్ ,కిష్టాపూర్ సర్పంచ్ వాసాల నరేష్, పొనకల్ ఉపసర్పంచ్ జలపతి, బి ఆర్ ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్ నాయకులు ఫసల్ ఖాన్, మున్వార్ అలీ ఖాన్, దేవయ్య, ఎం ఆర్ పి ఎస్ మండల అధ్యక్షుడు ప్రభుదాస్, బిజెపి నాయకులు గోలి చందు , సంద వేణి పవన్, కాంగ్రెస్ నాయకులు ముత్యం రాజన్న రజాక్ తదితరులు పాల్గొన్నారు.

# రాఘవేంద్ర లిటిల్ హాన్స్ పాఠశాల విద్యార్థులకు 'ఫైర్ సేఫ్టీ'పై అవగాహన!!




**ఖానాపూర్ ఆర్సి మన దునియా (ప్రతినిధి శరత్) మార్చ్:16**

జన్నారం మండలంలోని పొనకల్ గ్రామంలో గల రాఘవేంద్ర లిటిల్ హాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో అగ్ని ప్రమాదాలపై అవగాహన మరియు భద్రత కల్పించేందుకు విద్యార్థులకు అగ్ని మాపక శాఖ వారోత్సవాలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జన్నారం మండల ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ విద్యార్థులతో మాట్లాడుతూ..అగ్ని ప్రమాదాల నివారణ,భద్రతా చర్యలు మరియు అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో వివరంగా తెలియజేశారు.అలాగే అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు భయపడకుండా సరైన విధంగా ఎలా వ్యవహరించాలో విద్యార్థులకు వివరించారు.అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వెంటనే బయటకు ఎలా వెళ్లాలి,ఫైర్ ఎక్స్టింగ్విషర్ ను ఎలా ఉపయోగించాలి,అలాగే అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా విద్యార్థులకు ప్రాక్టికల్‌గా వివరించారు.ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థుల్లో భద్రతపై మరింత బాధ్యతను పెంపొందించారు.ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండి అగ్ని ప్రమాదాలపై అవగాహన,నివారణ మరియు అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మంచి అవగాహన కల్పించింది.విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ఎంతో ఆసక్తిగా వీక్షించి భద్రతపై ముఖ్యమైన విషయాలను నేర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్,కరస్పాండెంట్ ఎర్ర సంపత్,డీన్ హేమలత షిండే,ప్రిన్సిపల్ శ్రీనివాస్,ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం




**ముఖ్య అతిథిగా మాజీ కేంద్ర మంత్రి రేణుక చౌదరి**

**జిల్లాభివృద్ధికి కోట్ల నిధులు తీసుకువచ్చిన నాయకురాలు -- వీరబాబు**

**మన దునియా,ఖమ్మం జిల్లా:మార్చి 16**

ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యురాలు, మాజీ కేంద్ర మంత్రివర్యులు రేణుక చౌదరి హాజరయ్యారు.ఈ సందర్భంగా సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు మాట్లాడుతూ మాజీ కేంద్ర మంత్రి రేణుక చౌదరి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు రాజ్యసభ నిధుల ద్వారా అనేక కోట్ల రూపాయలను తీసుకువచ్చి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. గతంలో కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో కూడా అనేక కేంద్ర పథకాలను జిల్లాకు తీసుకువచ్చిన ఘనత రేణుక చౌదరికి దక్కిందని పేర్కొన్నారు.అలాగే కార్యకర్తలు కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచే నాయకురాలు రేణుక చౌదరి అని ఆయన అన్నారు. పార్టీ కార్యకర్తల సమస్యలను తెలుసుకుని వారికి ఎల్లప్పుడూ తోడుగా నిలిచే నాయకురాలు అని కొనియాడారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని కూడా వీరబాబు ప్రశంసించారు. రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలోనే గొప్ప ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నిలుస్తారని, ఆయన మరోసారి ముఖ్యమంత్రిగా కావాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పత్రికా విలేకరులు పాల్గొన్నారు.

# బాధితుడికి పోగొట్టుకున్న ఫోన్ తిరిగి తాటి రాజుకు అందజేసిన పసర ఎస్సై తాజుద్దీన్


**ములుగు జిల్లా మార్చి 16 మన దునియా**



గోవిందరావుపేట మండల కేంద్రంలో గల పసర పోలీస్ స్టేషన్ పరిధిలో గత కొద్ది రోజుల క్రితం ఉప్పుగల్ గ్రామానికి చెందిన తాటి రాజు కు చెందిన సెల్ ఫోన్ ఎక్కడో పడిపోగా వెంటనే బాధితుడు పోలీస్ స్టేషన్ కి వచ్చి ఫిర్యాదు చేయగా ఆధునిక టెక్నాలజీ సిఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్ ఫోన్ కనిపెట్టగా దానిని సోమవారం పసర ఎస్సై తాజుద్దీన్ బాధితుడు తాటి రాజు కి అందజేశారు ఈ కార్యక్రమంలో పసర పోలీసులు మరియు బాధితుడు తదితరులు పాల్గొన్నారు

# ఖానాపూర్ మాజీ శాసనసభ్యులు అజ్మీర గోవింద్ నాయక్ మృతి పట్ల సంతాపం తెలిపిన భూక్యా జాన్సన్ నాయక్ .

**ఖానాపూర్ ఆర్సి మన దునియా (ప్రతినిధి శరత్) మార్చ్:16.**



ఖానాపూర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అజ్మీర గోవింద్ నాయక్ ఈరోజు 16/03/2026 న ఆయన స్వగ్రామం లింగాపూర్ లో మృతి చెందిన వార్త తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసేవలో నిత్యం ముందుండే ప్రజానాయకుడిగా గోవింద నాయక్ పనిచేశారని, ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి మృతి ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలకు, రాజకీయ వర్గాలకు తీరని లోటని అన్నారు. ఈ విషాద సమయంలో గోవింద్ నాయక్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.అలాగే గోవింద్ నాయక్ సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని, ఆయన ప్రజాసేవా స్ఫూర్తి అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్టోన్ క్రషర్ అనుమతులు రద్దు చేయాలి

**కొత్త క్రషర్ టెండర్లకు పర్మిషన్లు ఇవ్వొద్దు..**

**కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన పత్తిపాక గ్రామ ప్రజాప్రతినిధులు**



**మన దునియా,హనుమకొండ జిల్లా శాయంపేట,పత్తిపాక:మార్చి 16**


హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామ శివారులో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్టోన్ క్రషర్ వల్ల స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాని అనుమతులను తక్షణమే రద్దు చేయాలని జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పత్తిపాక గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యుల బృందం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. క్రషర్ నుండి వెలువడుతున్న విపరీతమైన దుమ్ము, శబ్ద కాలుష్యం కారణంగా గ్రామస్తులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని ప్రజాప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పర్యావరణ నిబంధనలను తుంగలో తొక్కి క్రషర్ నిర్వహిస్తున్నారని, దీనివల్ల పంట పొలాలు కూడా దెబ్బతింటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతులకు మించి తవ్వకాలు జరిపారని, బోర్ బ్లాస్టింగ్స్ వల్ల ఇండ్లు పగుల్లుపడుతున్నాయని అన్నారు. ప్రస్తుతం ఉన్న క్రషర్‌తోనే తీవ్ర సమస్యలు ఎదుర్కొంటుంటే, కొత్తగా మరో క్రషర్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త క్రషర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు మంజూరు చేయకూడదని కోరారు. "గ్రామ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ తమకు ముఖ్యమని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న క్రషర్లపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పత్తిపాక ఉప సర్పంచ్ తుడుం రాజు, వార్డు మెంబర్లు నాలికె వీర ప్రతాప్, పోతుగంటి ప్రమీల సారయ్య, గజ్జి రాజు, అంకేశ్వరపు సాయి లక్ష్మి, కొడిమాల మహేందర్, గజ్జి రమేష్, గడ్డమీది హారతి కర్ణాకర్, చిట్టి రెడ్డి పద్మ జంగారెడ్డి, ఐరబోయిన స్వప్న రాజు, కందగట్ల ప్రవీణ్ కుమార్, తుడుం స్రవంతి రాజు, నాయకులు పెండేల కిరణ్, పోతుగంటి సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

**బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మార్వోకు బీజేపీ వినతి**

**మన దునియా,వేములవాడ, మార్చి16**



వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం అర్బన్ ఎమ్మార్వోకు వినతి పత్రం సమర్పించారు. ఎన్నికల సమయంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా మిడ్ మానేరు డామ్ ముంపు గ్రామాల నిర్వాసితులకు ఇవ్వాల్సిన రూ.5,04,000 ఆర్థిక సహాయం, పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. అప్పట్లో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి ముంపు గ్రామాల్లో రాత్రి బస చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం లేదని బీజేపీ నాయకులు విమర్శించారు.ప్రభుత్వం వెంటనే హామీలను అమలు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, యువమోర్చా రాష్ట్ర నాయకుడు జింక అనిల్, మండల ప్రధాన కార్యదర్శి గుండెకార్ల లక్ష్మణ్, ఆరేపల్లి ఉపసర్పంచ్ సిలువేని ప్రశాంత్, ఉపాధ్యక్షులు ఎరుగోక్కుల రమేష్, సీనియర్ నాయకులు చల్ల నరసయ్య, రేగుల పరుశురాం, పోచంపల్లి భాను, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు గోనె భాస్కర్, మండల కార్యదర్శి కొలనూరి సంజీవరెడ్డి, చొక్కాల మధు, అధికార ప్రతినిధి విశ్వనాథం శ్రీధర్, నాయకులు పెరంగాని మల్లేశం, ముదాం శ్రీనివాస్, చొక్కాల ప్రశాంత్, చర్ల దేవరాజ్, కంసాని రాము, వికాస్, గొడుగు మహేష్, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్‌టీఎస్‌లో చైతన్య స్కూల్ విద్యార్థి ప్రతిభ

**మన దునియా,వేములవాడ, మార్చి16**



వేములవాడలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ఐఎన్టీఎస్ పోటీ పరీక్షల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షల్లో వేములవాడ శ్రీ చైతన్య స్కూల్‌కు చెందిన విద్యార్థి కొమ్ము అక్షయ్ వరుణ్ కరీంనగర్ జోన్ స్థాయిలో స్పెషల్ ప్రైజ్‌గా ల్యాప్‌టాప్‌ను గెలుచుకున్నారు. ఈ బహుమతిని జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ చేతుల మీదుగా అందుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. పిల్లలకు చదువుతో పాటు ఆటపాటలలో కూడా అవకాశాలు కల్పిస్తున్నందుకు శ్రీ చైతన్య యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.పాఠశాల ప్రిన్సిపాల్ సుదేష్ కుమారి మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే విద్యార్థులకు ఒలింపియాడ్ తరహా పరీక్షలపై అవగాహన కల్పించడం శ్రీ చైతన్య విద్యాసంస్థల ప్రత్యేక కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులు భవిష్యత్తులో వివిధ పోటీ పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనే స్థాయికి ఎదుగుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏజీఎం ముద్రకోల రాజు, అకాడెమిక్ కోఆర్డినేటర్లు ప్రవీణ్, మమతా, ప్రిన్సిపాల్ సుదేష్ కుమారి, డీన్ అంజయ్య, ప్రైమరీ ఇన్‌చార్జ్ రజిత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆకునూరి సుధీర్, పీటీలు సుధాకర్, మారుతి, కవిత తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ‘ఆల్ ఇండియా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం’ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**మన దునియా,హైదరాబాద్:మార్చి15**

ఆల్ ఇండియా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్ లో నిర్వహించారు. జాతీయ అధ్యక్షుడు రాజు వస్తాద్, జాతీయ సెక్రటరీ జనరల్ బి. హరికృష్ణ , నగర అధ్యక్షులు సత్యనారాయణ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం సాక్షిగా కార్యవర్గ సభ్యులు ఎన్నికల అధికారి రాయకంటి నర్సింగ్ రావు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తామని, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ కోసం అన్ని రంగాలలో జరుగుతున్న అన్యాయాలను, వివక్షను సమర్థవంతంగా ఎదుర్కొంటామని ఈ సందర్భంగా నాయకులు ప్రతిజ్ఞ చేశారు. సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం నిరంతరం, నిస్వార్థంగా కృషి చేస్తామని, ఎన్ని ఆటంకాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా ఎస్సీల అభివృద్ధికి పాటుపడతామని కార్యవర్గ సభ్యులు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ నాయకులు పి. జగన్నాథం, ముత్తయ్య, వెంకటేశం, వైద్యనాథ్, పచ్చ శ్రీనివాస్, అనిల్, నవీన్, శోభారాణి, ఆకుల సుదర్శనం, వందనం, ఆవుల సుధీర్ తో పాటు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.


# కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ లతో గారడి చేసి ప్రజానీకానీ మోసం చేసింది.

**100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ 1000 రోజులు దాటిన అమలు చేయలేని దౌర్భాగ్యస్థితిలో ఉంది**

**ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేసిన కరీంనగర్ బిజెపి జోన్ నేతలు...**

**మన దునియా,కరీంనగర్:మార్చి 16**



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఆరు గ్యారెంటీ లతో గారడి చేసి ప్రజానీకానీ మోసం చేసిందని, 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ 1000 రోజులు దాటిన అమలు చేయలేని దుస్థితిలో ఉందని రాష్ట్ర ప్రభుత్వ తీరుపై కరీంనగర్ బిజెపి జోన్ నేతలు మండిపడ్డారు. 6 గ్యారంటీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, గ్యారంటీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ తీరును నిర్వహిస్తూ సోమవారం రోజున కరీంనగర్ బిజెపి ఈస్ట్ , వెస్ట్ , సౌత్ , నార్త్ , సెంట్రల్ జోన్ ల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి , కరీంనగర్ ఎమ్మార్వో కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి జోన్ అధ్యక్షులు జాడి బాల్ రెడ్డి, తణుకు సాయి కృష్ణ, పాదం శివరాజ్, బండారి గాయత్రి , అవదుర్తి శ్రీనివాస్ లు మాట్లాడుతూరాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు , 420 హామీలు ఇప్పటివరకు పూర్తిగా అమలు చేయలేని దౌర్భాగ్యస్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతి నెల అందిస్తామన్న రూ.2500 , రూ.500 కు గ్యాస్ సిలిండర్ లను అటకెక్కించిందన్నారు. రైతు భరోసా కు భరోసా లేకుండా పోయిందన్నారు. రైతు రుణమాఫీ నీ సక్రమంగా అమలు చేయలేకపోయిందన్నారు . యువ వికాసాన్ని గాలికి వదిలేసిందన్నారు.చేయూతనిస్తామని పెన్షన్లకు చేయిచ్చిదన్నారు . ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలకు 5 లక్షల రూపాయలు, తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గదాల స్థలాల అంశాలకు మంగళం పాడిందన్నారు. గృహజ్యోతి పథకాన్ని తూతూ మంత్రంగా అమలుచేసి చేతులు దులుపుకుందన్నారు. రెండున్నర ఏళ్లలో కాంగ్రెస్ సర్కార్ 6 గ్యారెంటీ ల విషయంలో ప్రజానీకాన్ని తీవ్రంగా మోసం చేస్తుందని వారు మండి పడ్డారు. ఈప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం 6 గ్యారంటీల ను వెంటనే అమలు చేయాలని లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో తీవ్ర మైన ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. బీజేపీ సీనియర్ నాయకులు గుజ్జా శ్రీనివాస్ రావు, కార్పొరేటర్లు బండా రమణ రెడ్డి , ఒంటెల సత్యనారాయణ రెడ్డి , సోమిడి వేణు, మేకల వెంకటేష్ , మాసం గణేష్ , అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లు వరాల జ్యోతి, బండి ప్రశాంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాంపల్లి శ్రీనివాస్, దేవసాని సత్యం, పొన్నం మొండయ్య, పెద్దపల్లి జితేందర్, రాగి సత్యనారాయణ, కదర్ల విమల్ కుమార్, అన్నాజీ వినీత్ కుమార్, ఉప్పరపల్లి శ్రీనివాస్, మంగళ రవిగోపాల్, దెయ్యాల మల్లేశం, విష్ణు ప్రసాద్ రావు, కేశవ రెడ్డి, పాశం తిరుపతి, పరుశురాములు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ బడ్జెట్లో విద్యకు 15% నిధులు కేటాయించాలి





**అర్బన్ నక్సలైట్ల ప్రభావంతో రూపొందిన విద్యా కమిషన్ నివేదికను బహిష్కరించాలి.**

**యువ న్యాయవాదులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి - బీజేవైఎం నాయకులు, న్యాయవాది నక్క ప్రమోద్**

**మన దునియా, కరీంనగర్:మార్చి16**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి విద్య ప్రధాన ఆధారం. నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటేనే సమాజం ముందుకు సాగుతుందనీ, గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ “అభయహస్తం” పేరుతో నిర్వహించిన ప్రచారంలో విద్యా రంగానికి రాష్ట్ర బడ్జెట్లో కనీసం 15 శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చిందని, ఇచ్చిన హామీ మేరకుతెలంగాణ బడ్జెట్లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి బీజేవైఎం నాయకులు, న్యాయవాది నక్క ప్రమోద్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా భారత్ జోడో యాత్ర సందర్భంగా విద్యారంగ విషయంలో ప్రజలకు హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. యువ న్యాయవాదుల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ పలు హామీలు ఇచ్చిందన్నారు. ముఖ్యంగా 5 సంవత్సరాల లోపు ప్రాక్టీసింగ్ జూనియర్ న్యాయవాదులకు ప్రతి నెల రూ.5,000 గౌరవ భృతి ఇవ్వడం, యువ న్యాయవాదులకు ప్రత్యేక ఇన్స్టిట్యూట్ ద్వారా శిక్షణ అందించడం,బార్ కౌన్సిల్కు ప్రతి సంవత్సరం రూ.100 కోట్ల నిధులు కేటాయించడంవంటి హామీలు ఇచ్చారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం సుమారు 2500 నుండి 3500 వరకు నూతనంగా అడ్వొకేట్లు తెలంగాణలో ఎన్రోల్ అవుతున్న నేపథ్యంలో, యువ న్యాయవాదుల సంఖ్య నిరంతరం పెరుగుతుందని, అయితే ఈ హామీలు ఇప్పటివరకు అమలులో కనిపించడం లేదని. యువ న్యాయవాదులు తమ వృత్తి ప్రారంభ దశలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ఈ హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ పాఠశాలలు మౌలిక వసతుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. పాఠశాల భవనాలు, ఉపాధ్యాయుల ఖాళీలు, ఆధునిక విద్యా సదుపాయాలు మెరుగుపడాలంటే విద్యా రంగానికి తగిన నిధులు కేటాయించడం అత్యవసరం అని అన్నారు. రాబోయే తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యా రంగానికి కనీసం 15 శాతం నిధులు కేటాయించాలని ఆయన కోరారు.అర్బన్ నక్సలైట్ల అని చెప్పుకునే వారి చేత తయారు చేసిన విద్యా కమిషన్ నివేదికలో అనేక తప్పుగా తడకలాగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇటువంటి నివేదికలు విద్యా వ్యవస్థను బలోపేతం చేయకుండా సమాజంలో గందరగోళాన్ని సృష్టించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అర్బన్ నక్సలైట్ల ప్రభావంతో రూపొందిన విద్యా కమిషన్ నివేదికను ప్రభుత్వం వెంటనే బహిష్కరించి, దేశ అభివృద్ధికి దోహదపడే జాతీయ విద్యా విధానం ను తెలంగాణలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని న్యాయవాది, బీజేవైఎం నాయకులు నక్క ప్రమోద్ డిమాండ్ చేశారు.

# మంత్రి తుమ్మలతో కొత్తగూడెం జిల్లా కలెక్టర్ భేటీ

**కలెక్టర్ కు మంత్రి తుమ్మలకీలక ఆదేశాలు**
**నవమికి భద్రాచలంకు సీఎం రేవంత్ రాక**
**సీఎం చేతుల మీదుగా భద్రాద్రి ఆలయ పనులకు శంకుస్థాపన**
**భక్తుల సేవలో ప్రభుత్వం నినాదంతో సేవలు**
**ఉగాది నాటికి కొత్తగూడెం- భద్రాద్రి ఆధునీకరణ పనులు పూర్తి చేయాలి**
**భారీ ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశం**
**సీతారామ డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేయాలి**
**యాతాలకుంట టన్నెల్ పనులు వేగవంతం**
**50,000 ఎకరాలు సాగులోకి తీసుకురావాలి**
**పాండురంగాపురం మల్కానగిరి రైల్వే లైన్ మంజూరు**
**ఫస్ట్ పేజీలో సారపాక వరకు భూ సేకరణ పూర్తి చేయాలి**
**రైల్వే లైన్ తో భద్రాద్రి పర్యాటకం, బిపిఎల్ వాటర్ ప్లాంట్లకు ప్రయోజనం**
**భద్రాచలం జిల్లాలో ఎయిర్పోర్ట్ కు అనుకూల భూమి గుర్తించండి**
**కొత్తగూడెం భువనగిరి రహదారిలో భద్రాద్రి పెండింగ్ పనులు పూర్తి చేయాలి**
**ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వ సబ్సిడీ**
**రైతులకు అవగాహన కల్పించాలి**
**భద్రాద్రి అభివృద్ధిపై మంత్రి తుమ్మల ఫోకస్**



**మన దునియా,కొత్తగూడెం: మార్చి16**

వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు తోభద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ భేటీ అయ్యారు. భద్రాద్రి జిల్లా సమగ్ర అభివృద్ధికి మంత్రి తుమ్మల కీలక దిశానిర్దేశం చేశారు. మంత్రితో జిల్లా కలెక్టర్ భేటీలో పలు కీలక భద్రాద్రి రామాలయ అభివృద్ధి పనుల పునర్నిర్మాణం, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, సాగునీటి పనులు, భూసేకరణ, రైల్వే లైన్ పనులు, పర్యాటక అభివృద్ధి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా శ్రీరామనవమి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలం పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

నవమి సందర్భంగా సీఎం రేవంత్ రాక....

శ్రీరామనవమి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలం పర్యటనకు రానున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. భద్రతా ఏర్పాట్లు, రవాణా, భక్తులకు సౌకర్యాలు, వసతి తదితర అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తుగా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తుల సేవలో ప్రభుత్వం అనే నినాదంతో ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. సకల సౌకర్యాలతో కళ్యాణం వీక్షించేలా ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

తొలి విడతలో రూ.100 కోట్లతో భద్రాద్రి ఆలయ పనులకు శంకుస్థాపన....

భద్రాచలం ఆలయ అభివృద్ధిలో భాగంగా 300 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని తొలి విడతలో సుమారు రూ.100 కోట్ల వ్యయంతో చేపట్టనున్న భద్రాద్రి ప్రాకారం నిర్మాణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ముఖ్యమంత్రి జిల్లాకు రానున్న నేపథ్యంలో కొత్తగూడెం నుంచి భద్రాచలం వరకు డివైడర్లు ,సెంటర్ లైటింగ్, పూల మొక్కలు సుందరీకరణ పనులు ఉగాది నాటికి పూర్తి చేసేలా ముమ్మరంగా చేపట్టాలన్నారు.

సీతారామ డిస్ట్రిబ్యూటరీ భూసేకరణ త్వరితగతిన పూర్తి.....

జిల్లాలో సాగునీటి విస్తరణకు కీలకమైన సీతారామ డిస్ట్రిబ్యూటరీ పనులకు అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. భూసేకరణ పూర్తయితే ప్రాజెక్టు పనులు వేగవంతమై రైతులకు త్వరగా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టులో యాతాలకుంట టన్నెల్‌లో మిగిలిన సుమారు 100 మీటర్ల పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు 50 వేల ఎకరాల భూమి సాగులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పాండురంగాపురం--మల్కాన్ గిరి రైల్వే లైన్‌కు ప్రాధాన్యం.....

భద్రాద్రి అభివృద్ధికి కీలకమైన పాండురంగాపురం --మల్కానగిరి రైల్వే లైన్‌కు అనుమతి లభించిందని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా మొదటి దశలో సారపాక వరకు భూ సేకరణ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

పర్యాటకాభివృద్ధికి రైల్వే లైన్ కీలకం...

ఈ రైల్వే లైన్ పూర్తయితే దక్షణ అయోధ్యగా ఉన్న భద్రాద్రి ప్రాంతంలో సాంస్కృతిక శోభ వెల్లి విరుస్తుందని, పర్యాటక రంగానికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం లభిస్తుందని మంత్రి తెలిపారు. అలాగే జిల్లాలో కీలకంగా ఉన్న బిపిఎల్ , హెవీ వాటర్ ప్లాంట్ల, కు కూడా రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ త్వరితగతిని పూర్తిచేసేలా చూడాలన్నారు.

భద్రాచలం జిల్లాలో ఎయిర్‌పోర్ట్‌కు అనుకూల భూమి గుర్తింపు...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు చోట్ల విమానాశ్రయాలు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని అక్కడ ఏర్పోర్ట్ అథారిటీ ఆప్రాంతాలను తిరస్కరించిందని, భద్రాచలం, కొత్తగూడెం, మధ్య ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అనుకూలమైన భూమిని గుర్తించాలని మంత్రి కలెక్టర్‌ను ఆదేశించారు. దీనిపై సంబంధిత శాఖలు సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సూచించారు.

కొత్తగూడెం--భువనగిరి రహదారిలో పెండింగ్ పనులు పూర్తి....

కొత్తగూడెం--భువనగిరి రహదారి పరిధిలో భద్రాద్రి జిల్లాలో ఉన్న పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ రహదారి అభివృద్ధి వల్ల రవాణా సౌకర్యాలు మెరుగుపడి వ్యాపార కార్యకలాపాలు పెరుగుతాయని తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన....

రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఆయిల్ పామ్ సాగుకు అందిస్తున్న సబ్సిడీలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మంత్రి తుమ్మల సూచించారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.జిల్లా అభివృద్ధికి సంబంధించిన ఈ కీలక ప్రాజెక్టుల అమలుపై అధికారులతో నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని మంత్రి తుమ్మల తెలిపారు

# గోదావరి నదిలో అక్రమ ఇసుక దందా

**ట్రాక్టర్లు, టిప్పర్లతో యథేచ్ఛగా తవ్వకాలు**
**అధికారులు చూస్తూ కూడా చూడనట్టు**
**ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం**

**మన దునియా,అశ్వాపురం: మార్చి 16**

అశ్వాపురం:గోదావరి నది పరివాహక ప్రాంతంలో అక్రమ ఇసుక తవ్వకాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. నది తీర ప్రాంతాల్లో ట్రాక్టర్లు, టిప్పర్ల సహాయంతో యథేచ్ఛగా ఇసుకను తవ్వి తరలిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. స్థానికంగా కొంతమంది వ్యక్తులు గుంపులుగా ఏర్పడి నది మధ్య భాగం నుంచి ఇసుకను తీసి ట్రాక్టర్లలో లోడ్ చేసి తరలిస్తున్నట్లు సమాచారం.పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఈ అక్రమ తవ్వకాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం స్థానికుల ఆగ్రహానికి కారణమవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా భారీగా ఇసుక తవ్వడం వల్ల నది సహజ ప్రవాహం దెబ్బతినే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇసుకను ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా సమీప ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాల వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం నష్టం వాటిల్లుతున్నట్లు సమాచారం.ఈ పరిస్థితిపై వెంటనే స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.



# అనుమానాస్పద స్థితిలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని మృతి

**మన దునియా,ఖమ్మం జిల్లా మార్చి 16**




అనుమానాస్పద స్థితిలో ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి చెందిన ఘటన ఖమ్మం జిల్లాలో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం అర్బన్ మండలం ధంసలాపురానికి చెందిన చింతకాయల శ్వేత (17) ముదిగొండ మండలం వల్లభి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నది.ఈ నెల 9న ఆరోగ్యం బాగాలేదని హాస్టల్ నుంచి ఫోన్ రాగా అదేరోజు శ్వేతను తల్లిదండ్రులు వచ్చి ఇంటికి తీసుకెళ్లారు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవటంతో ఈ నెల 12, 14న ఖమ్మంలోని దవాఖానల్లో వైద్యం చేయించారు.అయినా ఆరోగ్యం కుదటపడకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు శ్వేతను ఆరా తీయగా.. ఆయా మందలించడంతో ఈ నెల 7న హాస్టల్‌లో ఐరన్, పారాసిటమాల్ మాత్రలు వేసుకున్నానని చెప్పింది. దీంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా ఆదివారం ఉదయం పరిస్థితి విషమించి శ్వేత మృతిచెందింది.ఆయా మందలించడమే తమ కుమార్తె మృతికి కారణమని శ్వేత తల్లి ముదిగొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మురళి తెలిపారు.

# మణుగూరులో గ్యాస్ గోదాములపై ఆకస్మిక తనిఖీలు

**స్టాక్ రిజిస్టర్లు, ఆన్‌లైన్ బుకింగ్ విధానంపై పరిశీలన**
**కస్టమర్లకు సకాలంలో గ్యాస్ సరఫరా చేయాలని సూచనలు**
**బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**





**మన దునియా మణుగూరు:మార్చి 16**

మణుగూరు పట్టణంలోని సింగరేణి గ్యాస్ గోదాములో సివిల్ సప్లై అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సివిల్ సప్లై డీటీ శివకుమార్, హెచ్పీసీఎల్ సేల్స్ మేనేజర్ పవన్ కుమార్ కలిసి గోదాములోని స్టాక్ రిజిస్టర్లు, గ్యాస్ నిల్వలు, ఆన్‌లైన్ బుకింగ్ విధానం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా గోదాములో ఉన్న గ్యాస్ సిలిండర్ల నిల్వ వివరాలు, రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అన్న విషయాన్ని అధికారులు తనిఖీ చేశారు. అలాగే వినియోగదారులకు ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా సకాలంలో గ్యాస్ సిలిండర్లు అందుతున్నాయా లేదా అనే అంశంపై కూడా వివరాలు తెలుసుకున్నారు.కస్టమర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని గోదాం నిర్వాహకులకు అధికారులు సూచించారు. గ్యాస్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత ఉండాలని, వినియోగదారులకు సేవలు మెరుగుపరచాలని తెలిపారు.అదేవిధంగా మణుగూరు పట్టణంలోని పలు గ్యాస్ ఏజెన్సీలను కూడా సివిల్ సప్లై డీటీ శివకుమార్ పరిశీలించారు. ఆన్‌లైన్ బుకింగ్ ప్రకారం వినియోగదారులకు గ్యాస్ సరఫరా జరుగుతుందా లేదా అన్న అంశాన్ని స్టాక్ రిజిస్టర్ల ద్వారా పరిశీలించారు.గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా కఠినంగా జాగ్రత్తలు పాటించాలని గ్యాస్ డీలర్లకు హెచ్చరించారు. ఎవరైనా గ్యాస్ సిలిండర్లను అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్లు తేలితే సంబంధిత డీలర్‌తో పాటు తరలింపులో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి హత్య.. నార్సింగిలో షాక్ ఘటన

**మన దునియా,హైదరాబాద్: మార్చి16**




హైదరాబాద్: నగరంలోని నార్సింగి ప్రాంతంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. చాక్లెట్ ఇస్తానంటూ నమ్మబలికి చిన్నారిని తీసుకెళ్లిన ఓ కామాంధుడు అనంతరం ఆమెపై అత్యాచారం చేసి ప్రాణాలు తీశాడు.సమాచారం ప్రకారం, చిన్నారి ఆదివారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు రాత్రి సుమారు 10 గంటల సమయంలో నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు.సీసీటీవీ ఫుటేజ్‌లో చిన్నారిని ఓ వ్యక్తి తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపించడంతో అతడిని గుర్తించిన పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జరిగిన విచారణలో నిందితుడు చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసినట్టు వెల్లడైనట్లు సమాచారం.ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. చిన్నారిపై జరిగిన దారుణంపై ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ అంకిత్





**మన దునియా,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:మార్చి16**

ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించే విధంగా వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవో మధు, గృహ నిర్మాణ శాఖాధికారి రవీంద్రనాథ్ లతో కలిసి కలెక్టర్ ప్రజల వినతిపత్రాలను స్వయంగా స్వీకరించారు.జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పించగా, వాటిని శ్రద్ధగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి తక్షణ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ప్రజావాణిలో స్వీకరించిన పలు దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులో చర్యలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సమర్థవంతమైన పరిపాలన అందించడంలో అధికారులు కట్టుబడి ఉండాలని తెలిపారు.

ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు :

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్దబజార్ ప్రాంతంలో నివాసం ఉంటున్న సాంబ పూర్ణచంద్రరావు (తండ్రి: వెంకటేశ్వర్లు) తమకు కొత్తగూడెం పట్టణ పరిధిలోని గాజులరాజా బస్తీ, విశ్వనాథ కాలనీ, హౌస్ నం.169/గూ వద్ద 0.22 కుంటల పట్టా భూమి ఉందని తెలిపారు. ఆ భూమిని కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించి గృహ నిర్మాణం చేపడుతున్నారని, కావున తగిన చర్యలు తీసుకొని తమ భూమిని తిరిగి తమకు అప్పగించాలంటూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు.లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని సాయినగర్ కాలనీకి చెందిన ప్రజలు తమ కాలనీ సుమారు 35 సంవత్సరాల క్రితం ఏర్పడినప్పటి నుండి సీసీ రోడ్డు నిర్మాణం కోసం అనేకసార్లు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు రోడ్డు నిర్మాణం జరగలేదని తెలిపారు. 2019లో రూ.20 లక్షలు మంజూరైనట్లు చెప్పినప్పటికీ డ్రైనేజీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని పేర్కొంటూ వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని చేసిన దరఖాస్తును తగు చర్యల నిమిత్తం లక్ష్మీదేవిపల్లి ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు.టేకులపల్లి మండలం రాజాపురం గ్రామానికి చెందిన అశోక్ తమ గ్రామంలో సుమారు 10 సంవత్సరాల క్రితం మిషన్ భగీరథ ట్యాంక్ ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు సక్రమంగా నీటి సరఫరా జరగలేదని తెలిపారు. గ్రామంలో ఉన్న రెండు బోర్లు కూడా ప్రస్తుతం పనిచేయడం లేదని పేర్కొంటూ వేసవి కాలంలో త్రాగునీటి సమస్య పరిష్కరించేందుకు మిషన్ భగీరథ నీటి సరఫరా పునరుద్ధరించడంతో పాటు బోర్లను మరమ్మతు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం మిషన్ భగీరథ అధికారులకు ఎండార్స్ చేశారు.మణుగూరు మండలం విట్టల్‌రావు నగర్‌కు చెందిన రావుల రాములు (తండ్రి: లేటు నారాయణ) తమకు తిర్లాపురం గ్రామం సర్వే నం.16/23/గూలో ఐదు ఎకరాల భూమి ఉందని తెలిపారు. తమ తండ్రి మరణానంతరం కుటుంబ సభ్యులు ఆ భూమిని తమ పేర్లతో సర్వే చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొంటూ వివాదంలో ఉన్న భూమిపై సర్వే ప్రక్రియతో పాటు భూమి పరిహారం చెల్లింపులు తాత్కాలికంగా నిలిపివేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం భూసేకరణ అధికారులకు ఎండార్స్ చేశారు.ములకలపల్లి మండలం మాదారం గ్రామపంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న ఉకంటి రవికుమార్ (తండ్రి: వెంకట్రావు) గత రెండు సంవత్సరాలుగా గ్రామపంచాయతీలో పాలకవర్గాలు లేని సమయంలో నిర్వహించిన ఖర్చులు అప్పుల వివరాలను గ్రామపంచాయతీ నోటీస్ బోర్డులో ప్రజలకు తెలియజేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం జిల్లా పంచాయతీ అధికారికి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు భూ కేటాయింపు త్వరితగతిన పూర్తిచేయాలి : జిల్లా కలెక్టర్ అంకిత్








**మన దునియా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:మార్చి16**

జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా వేగవంతంగా అమలుకావాలంటే అవసరమైన భూమి కేటాయింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో భూమి కేటాయింపు, భూమి అవసరాల అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో వివిధ శాఖల పరిధిలో అమలులో ఉన్న అభివృద్ధి పనులపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ఆయా శాఖల ద్వారా మంజూరైన పనుల వివరాలు, వాటి ప్రస్తుత పురోగతి, ఎప్పుడు మంజూరు అయ్యాయి, ఇప్పటివరకు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి అనే అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఏ పథకం కింద పనులకు మంజూరు లభించింది, పనుల అమలుకు ఎంత భూమి అవసరం ఉంది, భూమి కేటాయింపులో ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి, అటవీ భూములకు సంబంధించిన సమస్యలు ఉన్నాయా వంటి అంశాలను కూడా కలెక్టర్ పరిశీలించారు.జిల్లాలో ప్రజలకు ఉపయోగపడే పలు అభివృద్ధి పనులు భూమి సమస్యల కారణంగా ఆలస్యం కాకుండా సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన భూమి గుర్తింపు, కేటాయింపు ప్రక్రియలను వేగవంతం చేసి పనులు త్వరగా ప్రారంభం కావడానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. భూమి కేటాయింపుకు సంబంధించిన ప్రతిపాదనలను పూర్తి వివరాలతో సమర్పించి, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అన్ని శాఖలు తమ శాఖల పరిధిలో అమలులో ఉన్న పనులపై సమగ్ర సమాచారం సేకరించి, మంజూరైన పనులు, వాటి పురోగతి, భూమి అవసరాలు, పెండింగ్‌కు కారణాలు వంటి అంశాలను వివరంగా పొందుపరుస్తూ నివేదికలను సిద్ధం చేసి జిల్లా పరిపాలనకు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు త్వరగా అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన అన్నారు .ఈ సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లెనినా, బీసీ సంక్షేమ శాఖ అధికారిని జయలక్ష్మి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని శ్రీలత, నీటిపారుదల శాఖ ఈఈ అర్జున్ రావు, పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్రీనివాస్ రావు, జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఇల్లందు, అశ్వరావుపేట, మణుగూరు మున్సిపల్ కమిషనర్ లు జిల్లా పంచాయతీ అధికారి సుధీర్, విద్యుత్, వ్యవసాయ, అటవీ, ట్రైబల్ వెల్ఫేర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వం వైఫల్యంతోనే చమురు సంక్షోభం

**అమెరికా సామ్రాజ్యవాద కాంక్షతోనే యుద్ధం**
**పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలను కేంద్రం నియంత్రించాలి**
**సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**
**హనుమకొండలో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా**



**మన దునియా,హనుమకొండ: మార్చి 16**

హనుమకొండ : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వైఫల్యంతోనే దేశంలో చమురు సంక్షోభం నెలకొందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం గ్యాస్, పెట్రోల్ ధరలను తగ్గించాలని, చమురు సంక్షోభాన్ని నివారించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాళీ గ్యాస్ సిలిండర్ లతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నేడు నెలకొన్న ఈ సంక్షోభం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న దూరదృష్టి లేని విధానాలు, తప్పుడు ప్రాధాన్యతల యొక్క ప్రత్యక్ష ఫలితం అన్నారు. ప్రభుత్వం తన విదేశాంగ విధాన ఎంపికల పరిణామాలను, భారతదేశ ఇంధన భద్రత, సరఫరాపై వాటి ప్రభావాన్ని అంచనా వేయడంలో విఫలమైందన్నారు. వినియోగదారులను రక్షించడానికి బదులుగా, ఆ భారాన్ని పూర్తిగా ప్రజలపై పడేలా చేసిందని, ఈ వైఫల్యాల పరిణామాలను ఎదుర్కోలేక, ప్రధానమంత్రి ఉపశమనం కల్పించడం కంటే ప్రతిపక్షంపై దాడి చేయడంలో బిజీగా ఉన్నారని అన్నారు. ఎల్పీజీ ధరల పెరుగుదలను, లక్షలాది మంది సాధారణ కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెట్టే పెరుగుతున్న సరఫరా కొరతను భారత కమ్యూనిస్ట్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. గృహ సిలిండర్లపై రూ. 60, వాణిజ్య సిలిండర్లపై రూ. 115 పెరుగుదలతో పాటు అనేక ప్రాంతాలలో లభ్యత లేకపోవడంతో, వంట గ్యాస్ పొందడానికి ప్రజలు మండే ఎండలో పొడవైన క్యూలలో నిలబడవలసి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్పీజీ శ్రామిక కుటుంబాలకు ఒక ప్రాథమిక అవసరం అయినప్పటికీ మోడీ ప్రభుత్వ వైఫల్యంతో దానిని రోజువారీ పోరాటంగా మార్చిందన్నారు. వాణిజ్య సిలిండర్లపై ఆధారపడిన చిన్న తినుబండారాలు, టీ స్టాళ్లు, ధాబాలు, రెస్టారెంట్లపై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. అలాగే అమెరికా సామ్రాజ్యవాద కాంక్షతోనే యుద్ధం కొనసాగుతుందని, యుద్ధాన్ని నివారించడానికి భారత్ తో సహా ప్రపంచ దేశాలు కృషి చేయాలని అన్నారు. భారత దేశం చమురు కొనుగోలు చేయడానికి అమెరికా సహా ఏ దేశం అనుమతి అవసరం లేదని, ఈ విషయంలో భారత దేశం సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, మంద సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు మోతె లింగారెడ్డి, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఎన్ ఎ స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం, మునిగాల భిక్షపతి, బత్తిని సదానందం, కొట్టెపాక రవి, మాలోత్ శంకర్ నాయక్, కొట్టే వెంకటేష్, అదరి రమేష్, వేల్పుల సారంగపాణి, కండె నర్సయ్య, గుంటీ రాజేందర్, కామెర వెంకట రమణ, అలువాల రాజు, యాళ్ళ సంజయ్, లకవత్ లక్ష్మి, భూక్యా స్వరూప, గోకాల రాజయ్య, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
మార్చ్ । మంగళవారం । 17 । 2026



# తెలంగాణ రైల్వే సమస్యలపై లోక్‌సభలో గళమెత్తిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**స్థానిక యువతకు కాజీపేట రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి**

**కాజీపేట జంక్షన్‌లో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించే చర్యలను కేంద్రం వెంటనే చేపట్టాలి**

**కాజీపేటలో ప్రతిపాదిత రైల్ అండర్, రైల్ టన్నెల్ ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి**

**తెలంగాణ ఐటీ, ఫార్మా, పారిశ్రామిక రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్నా.. రాష్ట్రంలో రైల్వే మౌలిక వసతులు అదే స్థాయిలో అభివృద్ధి చెందడం లేదు.**

**ఎన్నాళ్లుగానో పెండింగ్‌లో ఉన్న కాజీపేట రైల్వే తయారీ యూనిట్ ను తక్షణమే ప్రారంభించాలి**

**కాజీపేటను రైల్వే జోన్ ఏర్పాటు చేయాలి**

**హైస్పీడ్ రైలు ప్రాజెక్టులకు స్పష్టమైన టైమ్‌లైన్ ప్రకటించి పనులు వేగవంతం చేయాలి**

**వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య**

**మన దునియా న్యూఢిల్లీ:మార్చి 16**



తెలంగాణ రాష్ట్ర రైల్వే మౌలిక వసతుల అభివృద్ధిపై లోక్‌సభలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య బలంగా స్వరం వినిపించారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రైల్వే మంత్రిత్వ శాఖ డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్‌పై జరిగిన చర్చలో ఎంపీ పాల్గొని తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. దేశ ఆర్థికాభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం ఐటీ, ఔషధ పరిశ్రమలు, పారిశ్రామిక రంగాల్లో వేగంగా ఎదుగుతున్నప్పటికీ రాష్ట్రంలోని రైల్వే మౌలిక వసతులు ఆ స్థాయిలో అభివృద్ధి చెందలేదని ఎంపీ పేర్కొన్నారు. దశాబ్దాల పోరాటాల ఊతంగా కార్యరూపం దాల్చుతున్న రైల్వే మాన్యు ఫాక్చరింగ్ యూనిట్ లో స్థానికులకు ఉపాధి ఉద్యోగావకాశాలు తప్పనిసరిగా కల్పించాలని ఈ దిశగా జరిగే అన్ని ప్రయత్నాలకు తాను నాయకత్వం వహిస్తానని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేసారు. ప్రత్యేకంగా దేశంలోనే అత్యంత రద్దీగా మారిన కాజీపేట జంక్షన్‌ను డీకాంజెస్ట్ చేయడం అత్యవసరమని ఎంపీ తెలిపారు. ఈ నేపథ్యంలో కాజీపేటలో ప్రతిపాదిత రైల్ అండర్ రైల్ టన్నెల్ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు. అలాగే ఎన్నాళ్లుగానో పెండింగ్‌లో ఉన్న కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌ను తక్షణమే ప్రారంభించాలని కోరారు.అదేవిధంగా పరిపాలనా సౌలభ్యం కోసం కాజీపేట కేంద్రంగా కొత్త రైల్వే జోన్ లేదా బలమైన సబ్ జోన్ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. హైదరాబాద్‌ను చెన్నై, బెంగళూరు, పుణే నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్వే కారిడార్ల ప్రకటనను స్వాగతించిన ఎంపీ డా. కడియం కావ్య, వాటి అమలు కోసం స్పష్టమైన టైమ్‌లైన్ ప్రకటించి పనులు వేగవంతం చేయాలని కోరారు. తెలంగాణలో వెనుకబడిన మరియు గిరిజన ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ మెరుగుపర్చేందుకు ట్రాక్ విస్తరణ పనులను వేగవంతం చేయాలని కూడా ఎంపీ కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అభివృద్ధి దృష్ట్యా ఈ ప్రాజెక్టులు అత్యంత కీలకమని ఎంపీ డా. కడియం కావ్య తెలిపారు.

# చరిత్ర సృష్టించిన ఇటలీ కెరటం.. జకోవిచ్ 'ఆల్‌టైమ్ రికార్డు' బద్ధలు కొట్టేశాడు.!





చరిత్ర సృష్టించిన ఇటలీ కెరటం.. జకోవిచ్ 'ఆల్‌టైమ్ రికార్డు' బద్ధలు కొట్టేశాడు.!

పురుషుల టెన్నిస్‌లో తారాజువ్వలా దూసుకొచ్చిన జన్నిక్ సినర్ (Jannik Sinner) చరిత్ర సృష్టించాడు. చిన్న వయసులోనే అన్ని ప్రధాన హార్డ్ కోర్ట్ టోర్నీల్లో ఛాంపియన్‌గా అవతరించాడు. సోమవారం ఇండియన్ వెల్స్ ఫైనల్లో డానిల్ మెద్వెదేవ్ (ఋఅఅశ్రీ వీవఴజవఴవజ)ను చిత్తుగా ఓడించిన ఇటలీ కెరటం.. 24 ఏళ్లకే అన్ని హార్డ్‌కోర్ట్ ఈవెంట్లలో విజేతగా నిలిచాడు. తద్వారా నొవాక్ జకోవిచ్ (Novak Djokovic) పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును అతడు బద్ధలు కొట్టాడు.ఇండియన్ వెల్స్ ఫైనల్లో సినర్ ధాటికి డానిల్ మెద్వెదేవ్ తేలిపోయాడు. సెమీఫైనల్లో వరల్డ్ నంబర్ 1 కార్లోస్ అల్కరాస్ (Carlos Alcaraz)కు చెక్ పెట్టిన రష్యా ఆటగాడు ఇటలీ స్టార్ దూకుడు ముందు నిలువ లేకపోయాడు. ఈ టోర్నీలో ఒక్క సెట్ కూడా కోల్పోని సినర్.. ఫైనల్లోనూ పంజా విసిరి తో మట్టికరిపించాడు. ఫలితంగా 24 ఏళ్లకే ప్రధాన హార్డ్ కోర్టుల్లో ఛాంపియన్‌గా అవతరించాడీ సంచలనం. మొట్ట మొదటి ఇండియన్ వెల్స్ ట్రోఫీతోనే సినర్ దిగ్గజాల సరసన చేరాడు. ఇదివరకు జకోవిచ్ 31 ఏళ్లప్పుడు ఈ ఘనత సాధించాడు. కొన్నాళ్లుగా జకో పేరిటే ఉన్న ఈ రికార్డును సినర్ బ్రేక్ చేశాడు. అంతేకాదు అన్ని హార్డ్ కోర్టు 1000 మాస్టర్స్ టోర్నీల్లో విజేతగా నిలిచిన మూడో ఆటగాడిగానూ చరిత్రకెక్కాడు. అతడి కంటే ముందు రోజర్ ఫెదర్, జకోవిచ్ మాత్రమే ఈ మైలురాయిని అధిగమించారు.

# తెలంగాణలో గడ్డి, కలుపు మందులు నిషేదించండి..: రైతు కమిషన్




**మన దునియా,హైదరాబాద్: మార్చి16**

హైదరాబాద్: రాష్ట్రంలో విచ్చలవిడిగా లభిస్తున్న గడ్డి మందులను తక్షణమే నిషేధించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ బృందం అసెంబ్లీ ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి తోపాటు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులను కలిసి నివేదికను అందజేశారు.ప్రపంచవ్యాప్తం గా దాదాపు 70కి పైగా దేశాల్లో ఈ ప్రమాదకర రసాయనాలను నిషేధించారని తెలిపారు. కానీ మన దేశంలో ఇవి విచ్చలవిడిగా దొరుకుతు న్నాయని కమిషన్ పేర్కొంది.గ్రామీణ, తండా ప్రాంతాల్లో రైతులు క్షణికావేశంలో వీటిని తాగి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కూడా ఈ మందుల నిషేధాన్ని సమర్థిస్తోందని, ప్రజారోగ్యం దృష్ట్యా వీటిని అరికట్టాలని నివేదికలో వివరించారు. తెలంగాణలో ఈ మందులను నిషేధించడంతో పాటు, దేశవ్యాప్తంగా వీటిపై నిషేధం విధించేలా కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున లేఖ రాయాలని ముఖ్యమం త్రిని కోరాడు. రైతు కమిషన్ ప్రతిపాదనపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో చర్చించి, ప్రాణాంతక మైన ఈ విష రసాయనాలను రాష్ట్రంలో నిషే ధించేలా తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# రైతుబంధు రైతులకు అందేనా

బిఆర్ఎస్ మల్లంపల్లి మండల యూత్ అధ్యక్షుడు మొర్రి రాజుయాదవ్ రైతులకు రైతుబంధు ప్రకటనలతోనే సరిపోతుంది మున్సిపల్ ఎన్నికలు అయిపోగానే వేస్తామని చెప్పి ఇప్పటివరకు కూడా రైతుబంధు వేయకుండా రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఈ యాసంగి పనుల సీజన్ పూర్తికావస్తున్న కూడా పెట్టుబడి సాయం అందక రైతులు అనేక ఇబ్బందులు పడడం జరుగుతుందని రైతులకు పెట్టుబడి సాయం ఎప్పుడు అందుతుందని రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని దీ=ూ మండల యూత్ అధ్యక్షుడు మొర్రి రాజుయాదవ్ కోరుతూ కెసిఆర్ ఉన్నప్పుడు రైతులకు సకాలంలో రైతులకు రైతుబంధు మరియు ఎరువులు సకాలంలో అందేవి కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు నానా రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ ఎన్నికల ఓట్ల కోసమే కోడ్ ముగిసిన వెంటనే రైతుబంధు నిధులు విడుదల చేస్తామని చెప్పి ఇప్పటివరకు కూడా నిధులు విడుదల చేయకపోవడం ద్వారా రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.



రైతులను ఇబ్బంది పెట్టే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఎన్నికల వేళ పదిహేను వేలు ఇస్తామని నమ్మబలికి తీరా ఎన్నికలు ముగిశాక 12వేల రూపాయలు మాత్రమే ఇచ్చి మోసం చేసిందన్నారు. ఆ 12వేల రూపాయలు కూడా వ్యవసాయ పనుల సందర్భంగా ఇవ్వక రైతులను నట్టేట ముంచిన ఈ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వంగానే ప్రజలు చూస్తున్నారనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తెలుసుకోవాలన్నారు. అలాగే విత్తనాలు ఎరువులు కొనుగోలు సమయానికి డబ్బులు అందక అధిక మిత్తికి డబ్బులు తీసుకువచ్చి మరి వ్యవసాయం చేయడం జరుగుతుంది. కావున ప్రభుత్వం తక్షణమే రైతుబంధు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. వెంటనే రైతుల ఖాతాల్లో అన్ని విడతల రైతు బంధు డబ్బుకు జమ చేయకపోతే బిఆర్ఎస్ పార్టీ రైతులకు మద్దతుగా పెద్దఎత్తున పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



## ఆస్కార్ వేదికపై కోట శ్రీనివాసరావుకు నీరాజనం... తెలుగు నటుడికి అరుదైన గౌరవం

ప్రతిష్ఠాత్మక 98వ అకాడమీ (ఆస్కార్) అవార్డుల వేడుకలో తెలుగు సినీ పరిశ్రమ గర్వపడే క్షణం ఆవిష్కృతమైంది. గతేడాది దివంగతులైన సినీ ప్రముఖులకు నివాళు లర్పించే 'ఇన్ మెమోరియం' విభాగంలో విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావుకు అరుదైన గౌరవం దక్కింది. ఈ నివాళి కార్యక్రమంలో ఆయన పేరును స్మరించుకోవడం తెలుగు సినిమాకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపుగా నిలిచింది.లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కోటతో పాటు బాలీవుడ్ దిగ్గజం ధర్మేంద్ర, సీనియర్ నటి సరోజాదేవి, ప్రముఖ నటుడు మనోజ్ కుమార్‌లను కూడా అకాడమీ స్మరించుకుంది. అకాడమీ అధికారిక వెబ్‌సైట్‌లోని గ్యాలరీలో ఈ నలుగురు భారతీయ తారల చిత్రాలను ప్రదర్శించి, వారి సేవలను ప్రపంచానికి గుర్తు చేసింది. భారతీయ నటుల జాబితాలో తొలుత కోట శ్రీనివాసరావు పేరును ప్రస్తావించడం విశేషం. 2025 జూలై 13న కన్నుమూసిన కోట శ్రీనివాసరావు, తన అద్భుతమైన నటనతో తెలుగు చిత్ర పరిశ్రమలో చెరగని ముద్ర వేశారు. విలక్షణ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన ఆయన, తొమ్మిది నంది అవార్డులతో పాటు పద్మశ్రీ పురస్కారాన్ని కూడా అందుకున్నారు. వీరితో పాటు బంగ్లాదేశ్ నటి జయశ్రీ కబీర్, డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్ ఎస్. కృష్ణస్వామికి కూడా అకాడమీ నివాళులర్పించింది. ప్రపంచ సినీ వేదికపై భారతీయ నటీనటులకు, ముఖ్యంగా తెలుగు నటుడికి ఈ స్థాయిలో గౌరవం దక్కడం పట్ల సినీ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోట వంటి గొప్ప నటుడి సేవలను అంతర్జాతీయ వేదిక గుర్తించడం గర్వకారణమని పేర్కొంటున్నారు.

## పవన్ డైలాగ్స్ చెప్పి అలరించిన శ్రీలీల, రాశీ ఖన్నా

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో హీరోయిన్లు శ్రీలీల, రాశీ ఖన్నా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యాంకర్ సుమ వారితో చిట్ చాట్ చేస్తూ పవన్ కల్యాణ్ సినిమాలోని డైలాగ్స్ చెప్పమని కోరగా, శ్రీలీల, రాశీ ఖన్నా తమదైన శైలిలో పవన్ కల్యాణ్ డైలాగ్ చెప్పి అభిమానులను అలరించారు. యూసఫ్‌గూడలోని పోలీస్ గ్రౌండ్స్‌లో నిన్న ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈవెంట్‌లో పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్, నిర్మాతలు నవీన్ యెర్నేని, వై. రవి శంకర్, యాంకర్ సుమ కనకాల పాల్గొన్నారు. కాగా, 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రాన్ని మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ఈ సినిమాకు బెనిఫిట్ షో ప్రదర్శించుకునేందుకు అనుమతి ఇచ్చింది.






## 'ఉస్తాద్ భగత్ సింగ్'... తమిళనాడులోని అన్ని ప్రాంతాల్లో రిలీజ్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడులోనూ భారీ ఎత్తున విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించారు.ఉగాది పండుగ కానుకగా మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా తమిళనాడు పంపిణీ హక్కులను ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ ఏజీఎస్ సినిమాస్ దక్కించుకుంది. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేసింది. పవన్ కల్యాణ్ సినిమాను తమిళనాడు వ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించడంతో అక్కడి అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పవన్ కల్యాణ్, హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి.

## ఆస్కార్ వేదికపై అరుదైన 'టై'.. ఒకే అవార్డుకు ఇద్దరు విజేతలు!




ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో ఓ అరుదైన, ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. 98 ఏళ్ల ఆస్కార్ చరిత్రలో కేవలం ఏడోసారి ఒకే కేటగిరీకి ఇద్దరు విజేతలుగా నిలిచి 'టై' నమోదైంది. ఈ ఊహించని పరిణామంతో డాల్బీ థియేటర్ ఒక్కసారిగా చప్పట్లతో మార్మోగింది. వివరాల్లోకి వెళ్తే, బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో అవార్డును ప్రకటించేందుకు నటుడు కుమాయిల్ నంజియాని వేదికపైకి వచ్చారు. విజేత పేరు ప్రకటించేందుకు ఎన్వలప్ తెరిచిన ఆయన, ఒక్కసారిగా మౌనంగా ఉండిపోయారు. అనంతరం, 'ఈ కేటగిరీలో టై అయ్యింది. ఇద్దరు విజేతలు ఉన్నారు' అని ప్రకటించడంతో సభలో ఆసక్తి నెలకొంది. ఈ అవార్డును 'ది సింగర్స్', 'టూ పీపుల్ ఎక్స్ఛేంజ్ సలైవా' చిత్రాలు సంయుక్తంగా గెలుచుకున్నాయి. ఈ సందర్భంగా కుమాయిల్ నంజియాని చమత్కరిస్తూ, 'షార్ట్ ఫిల్మ్ అవార్డు ఇవ్వడానికి రెట్టింపు సమయం పట్టడం విచిత్రంగా ఉంది' అన్నారు. దీనిపై హోస్ట్ కోనన్ ఓబ్రియన్ స్పందిస్తూ, 'ఈ టై వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆస్కార్ బెట్టింగ్ వేసిన 22 మిలియన్ల మంది పరిస్థితి ఏంటి?' అని జోక్ చేయడంతో సభలో నవ్వులు పూశాయి. ఈ అరుదైన ఘటన సినీ ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY [illegible] SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com